రాష్ట్ర ప్రెస్ అకాడమీ చైర్మన్‌కు ఘనస్వాగతం

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్: రాష్ట్ర ప్రెస్‌అకాడమీ చైర్మన్ కొమ్మినేని శ్రీనివాసరావు జిల్లా పర్యటనలో భాగంగా కుప్పం ఆర్ అండ్‌బి అతిథి గహానికి గురువారం ఉదయం చేరుకున్నారు. ఈసందర్భంగా ఆయనకు ఘనస్వాగతం లభించింది.ప్రెస్ అకాడమీ చైర్మన్ కొమ్మినేని శ్రీనివాసరావుకు ఎమ్మెల్సీ భరత్, కుప్పం మున్సిపల్ చైర్మన్ డాక్టర్, సుధీర్ ఎంపీపీ అశ్విని, జిల్లా సమాచార పౌరసంబంధాల శాఖ అధికారి బి.పద్మజ, ఎపిఓ రమణ, ప్రజాప్రతినిధులు, కుప్పం ప్రెస్‌క్లబ్ తరుపున పాత్రికేయులు ఆర్‌అండ్‌బి అతిథి గహంలో చైర్మన్‌కు పుష్పగుచ్ఛం ఇచ్చి ఘనంగా స్వాగతం పలికారు. ఏపీ ప్రెస్‌అకాడమీ చైర్మన్‌గా బాధ్యతలు స్వీకరించిన అనంతరం మొదటిసారి జిల్లాకు విచ్చేసి కుప్పంలో పలు ప్రాంతాలను మున్సిపల్ చైర్మన్ డాక్టర్ సుధీర్‌తో కలిసి చైర్మన్ పర్యటించారు.

బీఎల్‌వోలు బాధ్యతగా పనిచేయాలి

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్: ఎన్నికల నిర్వహణలో ప్రధాన అంశమైన ఓటరు జాబితా తయారీలో బిఎల్‌ఓలదే ప్రముఖపాత్ర ఉంటుందని, ఎటువంటి తప్పులకు తావు లేకుండా ఈప్రక్రియ నిర్వహించాలని జాయింట్ కలెక్టర్ పి.శ్రీనివాసులు అన్నారు. గురువారం ఉదయం జిల్లా సచివాలయంలోని సమావేశపు మందిరంలో జిల్లా జాయింట్ కలెక్టర్ డిఆర్‌ఓ ఎన్.రాజశేఖర్, జడ్పీ సీఈఓ ప్రభాకర్ రెడ్డి, ఎస్‌డిసిలు భవాని, పర్వీన్‌లతో కలిసి జిల్లాలోని తహశీల్దార్లు, డీటీలు, బీఎల్‌ఓలకు వీడియో కాన్ఫరెన్స్ ద్వారా అవగాహన కార్యక్రమం నిర్వహించారు.

ఈ సందర్భంగా జెసి మాట్లాడుతూ ఓటర్ జాబితాలో మార్పులు, చేర్పులకు సంబంధించి ఆన్‌లైన్ ప్రక్రియ దేశవ్యాప్తంగా నిర్వహిస్తున్న కారణంగా కొన్ని సాంకేతిక సమస్యలు తలెత్తడంతో ఆఫ్లైన్ విధానంలో ఈనెల 8వ తేదీ లోపు ఈ ప్రక్రియను పూర్తి చేయాలన్నారు. రాజకీయ పార్టీలు ఇచ్చిన జాబితా మేరకు బిఎల్‌ఎల నియామకం జరిగిందని, ఆ మేరకు బిఎల్వోలు క్షేత్రస్థాయిలో ఇంటింటి పరిశీలన సమయంలో బిఎల్‌ఏలను తీసుకెళ్లాలని అన్నారు. ఓటర్ల మార్పులు, చేర్పులు లేదా తీసివేతలు కార్యక్రమం నిర్వహించే సమయంలో దానికి సంబంధించిన డాక్యుమెంట్లను తప్పనిసరిగా తీసుకోవాలన్నారు. ప్రస్తుతం ఎన్రోల్మెంట్ కార్యక్రమం 5జనవరి 2023 ఓటర్ల జాబితా ప్రకారం నిర్వహించ బడుతోందని సప్లమెంటరీగా ఏప్రిల్, జూలై నెలలో విడుదల చేసిన జాబితాలను పరిశీలించాల్సి ఉంటుందని అన్నారు. ఓటరు నమోదు, మార్పులు, తీసివేతలపై బిఎల్వోలు రిజిస్టర్‌ను నిర్వహించాలని అన్నారు. ఇతర దేశాల నుంచి వచ్చి ఓటు హక్కు కావాలని భావించే వారికి వారి ఆధార్ కార్డుతో పాటు ఇతర అర్హతల ధవపత్రాలను తీసుకోవాలని అన్నారు. ఎవరైనా పోలింగ్ స్టేషన్ మార్పు కావాలని కోరిన, నియోజకవర్గ మార్పుకావాలని కోరిన అందుకు తగిన ఆధారాలతో బదిలీ చేయ వచ్చునని అన్నారు.

ఓటర్ల జాబితాపై వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న జెసి

ముఖ్యమంత్రి ట్రెండ్ సెట్టర్

మాట ఇస్తే.. చేస్తారంతే: ఆర్కేరోజా

ప్రజాశక్తి- నగరి: ముఖ్యమంత్రి ట్రెండ్ సెట్టర్ అని రాష్ట్ర పర్యాటక రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, యువజన సర్వీసుల, క్రీడాశాఖ మంత్రి ఆర్కేరోజా అన్నారు. గురువారం నగరి పట్టణంలోని స్వగహంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. ఎన్నికలు జరిగేవరకే రాజకీయం ఆపై అందరూ మనవాళ్లే అందరికీ మంచిచేయాలని జగనన్న ప్రజాసంకల్ప యాత్రలో చెప్పారని అది అక్షరాల నేడు నెరవేరుస్తున్నారని అన్నారు. పార్టీలు, కులమతాలు, సిఫారసులు లేకుండా జరిగింది కనుకే నేడు జగనన్న సురక్ష ఆంధ్రప్రదేశ్ ప్రజలకు శ్రీరామరక్షగా మారిందన్నారు. కోటీ నలభై రెండు లక్షల మంది ఇళ్లను సర్వేచేసి వారి అవసరాలు గుర్తించి 93లక్షల మందికి 11 రకాల సర్టిఫికేట్లు రూపాయి ఖర్చు లేకుండా అందించడం జరిగిందన్నారు. ఆయన విజన్ ఎంటో అందరికీ అర్థమైందన్నారు. జగనన్న పారదర్శకతలో ట్రెండ్ సెట్టర్ అయ్యారన్నారు. పాదయాత్రలో చెప్పినట్లు ప్రజల కష్టాలు దూరం చేసేలా ఇటు సంక్షేమం, అటు అభివద్ధి చేస్తూ జగనన్న సురక్ష ద్వారా సర్టిఫికేట్లు కూడా అందించిన తీరు నభూతో నభివిష్యత్ అన్నారు. దేశంలో ఇప్పటి వరకు ఏ ముఖ్యమంత్రి చేయలేనటువంటి పని జగనన్న చేశారని ఇది తమకు గర్వకారణమన్నారు. కమిట్‌మెంట్‌కు ఆయన ఉన్నతమైన ఉదాహరణ అన్నారు. దేశానికి స్వతంత్ర్య వచ్చాక ప్రజాసేవకు ఎన్నో వ్యవస్థలు వచ్చాయని వాటన్నింటిని సచివాలయ వ్యవస్థ అధిగమించిందన్నారు. సచివాలయాలు చేసే సేవ గ్రామాల్లోకి వెలితే అర్థమౌతుందన్నారు. సచివాలయాలు ఎందుకని అడిగిన వారికి నేడు అది ఎందుకో తెలియవచ్చిందన్నారు. నగరి నియోజకవర్గంలో 88 జగనన్న సురక్ష క్యాంపులు నిర్వహిస్తే 44577 మంది ధరఖాస్తుచేసుకున్నారని అర్హత ఆధారంగా 43119 మంది సర్టిఫికేట్లు పొందారన్నారు. 97 శాతం మందికి 11 రకాల సర్టిఫికేట్లు అందిందన్నారు. ఇది సమర్ధవంతమైన పాలనకు ఆధారపూరిత నిదర్శనమన్నారు. అందుకే నేడు ప్రజల గుండెల్లో జగనన్న బొమ్మ నిలిచిపోయిందన్నారు.

జర్నలిస్టులు వాస్తవాలు రాయాలి

రాష్ట్ర ప్రెస్ అకాడమీ చైర్మన్

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్: జర్నలిస్టులు వాస్తవాలు గ్రహించి వార్తలు రాయాలని రాష్ట్ర ప్రెస్‌అకాడమీ చైర్మన్ కొమ్మినేని శ్రీనివాస్ రావు పేర్కొన్నారు. రాష్ట్ర ప్రెస్ అకాడమీ చైర్మన్ గురువారం కుప్పం పర్యటనలో భాగంగా ఆర్‌అండ్ బి అతిథి గహంలో మున్సిపల్ చైర్మన్ డాక్టర్ సుధీర్‌తో కలసి పాత్రికేయులతో ముఖాముఖి నిర్వహించారు. ఈసందర్భంగా చైర్మన్ మాట్లాడుతూ జర్నలిస్టులు వాస్తవాలు మాత్రమే రాయాలని, జర్నలిజంలో విలువలను పాటించాలన్నారు. ఏ ప్రభుత్వం ఉన్నాను వాస్తవాలు రాయాలన్నారు. పులివెందులలో జరిగిన అభివద్ధిని చూస్తే కుప్పంలో చంద్రబాబు నాయుడు చేసిన అభివద్ధి తక్కువేనని తెలిపారు. పులివెందులలో భూగర్భ డ్రైనేజీ ఉందని, ఆర్‌టిసి బస్టాండ్, పార్క్, నగరవనం, నైపుణ్య అభివద్ధి సంస్థ, ప్రైవేట్ పరిశ్రమలు, కడప నుండి పులివెందుల వరకు డివైడర్ డబుల్ లైన్‌రోడ్లు ఉన్నాయన్నారు. పులివెందులలో పూరి గుడిసె అనేది లేకుండా అందరికీ పక్కాగహాలు నిర్మించడం జరిగిందని తెలిపారు. రింగ్ రోడ్లు మెడికల్ కళాశాల, జేఎన్టీయూ ఇంజనీరింగ్ కళాశాల, ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల అన్ని మారుమూలన్న ఉన్నాయని, పులివెందులను రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్.జగన్మోహన్ రెడ్డి అన్నివిధాలుగా అభివద్ధి చేశారని తెలిపారు.

చంద్రబాబు నాయుడు 14 సంవత్సరాల ముఖ్యమంత్రిగా ఉండి కూడా కుప్పంను అనుకున్నంత స్థాయిలో అభివద్ధి చేయలేదని, కనీసం ఆయన నియోజకవర్గంలోని జర్నలిస్టులకు ఇండ్లు మంజూరు చేయలేదని విమర్శించారు. చిత్తూరు నుండి కుప్పానికి మామూలు రోడ్డు కలదని, రింగ్ రోడ్డు లేదని, ప్రభుత్వ మెడికల్ కళాశాల లేదని తెలిపారు. కుప్పం నియోజకవర్గంలో కూడా ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి కులాలు, మతాలు, పార్టీలు అతీతంగా అభివద్ధి పథకాలను అందజేస్తున్నారని తెలిపారు. కుప్పంలో రూ.100 కోట్లతో వివిధ రకాల అభివద్ధి పనులు చేపట్టడం జరిగిందని, హంద్రీనీవా ద్వారా రెండు నెలల్లో కుప్పానికి సాగు, తాగునీరు అందడం కూడా జరుగుతుందని అన్నారు. కుప్పం మున్సిపాలిటీని, కుప్పంను రెవెన్యూ డివిజన్ చేసిన ఘనత ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డికి దక్కిందన్నారు. అంతకుముందు మున్సిపల్ చైర్మన్‌తో కలిసి కుప్పం పట్టణంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను పుణ్యసముద్రం వద్ద హంద్రీ నీవా, సుజల స్రవంతి కాలువ పనులను, జగనన్న కాలనీల నిర్మాణ పనులను పరిశీలించారు. సమావేశంలో ఓఎస్‌డి శ్రీనివాస్ జీవన్, కుప్పం ప్రెస్‌క్లబ్ అధ్యక్షుడు వెంకటాచలం, ఎలక్ట్రాన్ మీడియా ప్రెసిడెంట్ ప్రశాంత్, సెక్రెటరీ రోహిత్, సీనియర్ పాత్రికేయులు సోమశేఖర్, మునిగోపాల్, హరినాథ్, సుబ్రహ్మణ్యం, శ్రీనాథ్ శివకుమార్, సెంథిల్, అజ్గర్, ఆనంద్, చలపతి నాథముని తదితరులు పాల్గొన్నారు.

కుప్పంలో పర్యటిస్తున్న ప్రెస్ అకాడమి చైర్మన్

వైఎస్సార్ అవార్డులకు దరఖాస్తుల ఆహ్వానం

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్: వైఎస్సార్ లైఫ్ టైం అవార్డు- 2023, వైఎస్సార్ అవార్డులకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా క్రీడలఅధికారి డాక్టర్ వి.మురళీకష్ణ రెడ్డి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. కళలు, సామాజిక సేవ, సైన్స్ అండ్ ఇంజినీరింగ్, ట్రేడ్ అండ్ ఇండస్ట్రీ, మెడిసిన్, లిటరేచర్ అండ్ ఎడ్యుకేషన్, పబ్లిక్ అఫైర్స్, సివిల్ సర్వీసెస్, స్పోర్ట్స్ తదితర రంగాల్లో జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో ప్రతిభా పాఠవాలు చూపిన వ్యక్తులు దరఖాస్తుకు అర్హులని వివరించారు. ఉత్తమసేవలు అందిస్తున్నప్పటికీ ప్రజాజీవనంలో కనిపించక అజ్ఞాత వ్యక్తుల్లా గ్రామాలు ఇతర ప్రాంతాల్లో ఉన్న వ్యక్తులు కూడా అర్హులని పేర్కొన్నారు. స్వచ్ఛంద సంస్థలు, సొసైటీలు కూడా దరఖాస్తు చేయవచ్చని తెలిపారు. వ్యక్తులు, సంస్థలు చేసిన పనిని ఒక పేజీలో క్లుప్తంగా తెలియజేస్తూ ఈమెయిల్తో సహా పూర్తివివరాలను సమర్పించాలని సూచించారు. క్రీడా రంగంలో గల ఆసక్తి, అర్హత గల వ్యక్తులు, సంస్థలు దరఖాస్తులను ఆగస్టు 20వ తేదీ సాయంత్రం 5 గంటలు లోగా సమర్పించాలని కోరారు.

ఎకరాకు రూ.10 వేలు ఇవ్వాలి

7న చలో విజయవాడ

చలో విజయవాడ పోస్టర్లు ఆవిష్కరిస్తున్న రైతు సంఘం నాయకులు

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్: సాగు చేస్తున్న ప్రతి రైతుకు ఎకరాకు రూ.10వేలు రాష్ట్ర ప్రభుత్వం ఇవ్వాలని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం ఏఐకేఎస్ ఆధ్వర్యంలో ఈనెల7వ తేదీన తలపెట్టిన చలో విజయవాడ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని కోరుతూ మహాత్మా గాంధీ విగ్రహం వద్ద గోడపత్రికలను విడుదల చేశారు. ఆ సంఘం జిల్లా కార్యదర్శి కందుల మునిరత్నం నాయుడు, తిరుపతి జిల్లా కార్యదర్శి బెల్లంకొండ శ్రీనివాసులు మాట్లాడుతూ ప్రభుత్వ విధానాల కారణంగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో 2,45,000 మంది రైతులు అప్పులతో బ్రతుకు ఇడుస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రకటించిన మద్దతు ధరలు ఆ శాస్త్రీయంగా ఉందన్నారు. డాక్టర్ స్వామినాథ కమీషన్ సిఫార్సులను ప్రభుత్వాలు పట్టించుకోకపోవడం బాధాకరమని అన్నారు. పెరుగుతున్న ఉత్పత్తి ఖర్చులను దష్టిలో పెట్టుకొని అన్నిరకాల విత్తనాలు, ఎరువులు, పురుగుమందులు, ఉపకరణాలను 90 శాతం సబ్సిడీ అందించాలని కోరారు. వ్యవసాయ విద్యుత్ మోటార్లకు మీటర్ల బిగించే ఆలోచనను ఉపసంహరించుకోవాలి, ఉచిత విద్యుత్తు కొనసాగించాలి, అన్ని పంటలకు సర్వేనెంబర్ యూనిట్‌గా పంటల బీమాను వర్తింపజేయాలని, రైతు, కౌలు రైతులకు అన్ని రకాల పంట రుణాలను రెండు లక్షల రూపాయల వరకు మాఫీ చేయాలని డిమాండ్ చేశారు. అలాగే ప్రకతి విపత్తు వల్ల నష్టపోయిన ఆహార పంటలకు రూ.25వేలు, వాణిజ్య పంటలకు రూ.50వేలు ఉద్యాన పంటలకు లక్ష రూపాయలు చొప్పున ప్రతిఎకరాకు నష్టపరిహారం చెల్లించాలి డిమాండ్ చేశారు.

ఎన్‌జీవో రాష్ట్ర కౌన్సిల్ మహాసభల

పోస్టర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్: 21వ ఏపీఎన్జీవో సంఘం రాష్ట్ర కౌన్సిల్ మహాసభలకు సంబంధించిన ఆహ్వాన గోడపత్రిక (పోస్టర్)ను జిల్లా అధ్యక్షులు కేవీ.రాఘవులు, కార్యదర్శి రఘు, జిల్లా కార్యవర్గ సభ్యులు, చిత్తూరు తాలుకా కార్యవర్గ సభ్యులు గురువారం స్థానిక ఎన్‌జీవో హోంలో ఆవిష్కరించారు. అందరూ ఈనెల 21,22 తేదీల్లో విజయవాడలో జరుగు కౌన్సిల్ సమావేశంలో పాల్గొని విజయవంతం చేయాలని ఎన్‌జీవో సంఘం జిల్లా అధ్యక్షులు రాఘవులు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మురళీమోహన్, రమేష్, మహేష్, వరప్రసాద్, బాలసుబ్రమణ్యం, సురేష్, భానుప్రకాష్, ప్రసాద్, సుభాన్, మురళి తదితరులు పాల్గొన్నారు.

పోస్టర్లు ఆవిష్కరిస్తున్న ఎన్‌జీవో సంఘం నాయకులు

చాట్‌బాట్‌తో 200 మొబైల్ ఫోన్లు రికవరీ

రికవరీ చేసిన సెల్‌ఫోన్లను చూపుతున్న అడిషనల్ ఎస్పీ అడ్మిన్ సుధాకర్

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్: జిల్లా ఎస్పీ వై.రిశాంత్ రెడ్డి ఆదేశానుసారం గురువారం చిత్తూరు పోలీస్ గెస్ట్‌హౌస్ కాన్ఫరెన్స్ హాల్‌లో 'మొబైల్ రికవరీ మేళా' కార్యక్రమాన్ని జిల్లా అడిషనల్ ఎస్పీ అడ్మిన్ ఏర్పాటు చేసి రెండవ విడతలో రికవరీ చేసిన సుమారు 45 లక్షల విలువగల 200 మొబైల్ ఫోన్‌లను బాధితులకు అడిషనల్ ఎస్పీ అడ్మిన్ ఎల్.సుధాకర్ అందజేశారు. ఈసందర్భంగా అడిషనల్ ఎస్పీ అడ్మిన్ మీడియాతో మాట్లాడుతూ మొబైల్ ఫోన్ చోరీకి గురైతే ఎటువంటి కంప్లయింట్ లేకుండా పోలీస్ స్టేషన్‌కు వెళ్ళకుండా ఎఫ్ఐఆర్ నమోదు చేయకుండా ఇంట్లో కూర్చొని చిత్తూరు పోలీసు వారి 'చాట్ బాట్ సేవల ద్వారా పోగొట్టుకున్న మొబైల్ ఫోన్‌ను మరల పొందవచ్చునని తెలిపారు. చిత్తూరు జిల్లా వ్యాప్తంగా రెండు నెలల వ్యవధిలో రెండవ సారి 200 మొబైల్ ఫోన్లను రికవరీ చేసి బాధితులకు అందజేయడం సంతోషంగా ఉందన్నారు. సెల్‌ఫోన్స్ పోగొట్టుకున్న వారి మొబైల్స్‌ను చిత్తూరు జిల్లా క్రైమ్ ఇన్స్పెక్టర్ భాస్కర్, క్రైమ్ ఎస్ఐ ఉమామహేశ్వర రావు ఆధ్వర్యంలో సిబ్బంది, టెక్నికల్ అనాలసిస్ వింగ్ ఇంచార్జ్ దేవరాజులు సిబ్బంది సంయుక్తంగా మొబైల్ ఫోన్లను రికవరీ చేశారు. ప్రజలకు మంచి సేవలందించేందుకు చాట్ బాట్ బందం మొబైల్ ట్రాకింగ్ పై బాగా పనిచేస్తున్నారన్నారు. ఇంకా పెండింగ్ రికవరీలు ఉన్నాయని వాటిని కూడా అతిత్వరలో రికవరీ చేసి భాదితులకు అందచేస్తామని తెలియజేశారు.

రూ. 13 కోట్లతో సీహెచ్‌సీ ఆస్పత్రి నిర్మాణం

ప్రజాశక్తి- కార్వేటినగరం: రాష్ట్ర ఉపముఖ్యమంత్రి ప్రతిష్టాత్మకంగా తీసుకొచ్చిన 50 ఆస్పత్రి (సీహెచ్సీ) నిర్మాణానికి రూ.13కోట్లు నాబార్డు నిధులు మంజూరు చేయడం జరిగిందని సూపరింటెండెంట్ ఇంజనీర్ కష్ణారెడ్డి అన్నారు. గురువారం మండల కేంద్రంలో నూతనంగా నిర్మాణం చేపడుతున్న సామాజిక ఆరోగ్య కేంద్రం నిర్మాణాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఎస్ఈ మాట్లాడుతూ నిర్మాణం పనులు వేగవంతంగా జరుగుతున్నాయని, ప్రభుత్వం ఆదేశాల మేరకు నాణ్యతను పాటిస్తూ నిర్మాణాలు జరుగుతున్నాయని చెప్పారు. అదేవిధంగా ఇసుక, కంకరను పరిశీలించి నాణ్యతగా ఉందని సంతప్తి వ్యక్తం చేశారు. ఇదే నాణ్యతతో పనులను త్వరగా పూర్తి చేయాలని గుత్తేదారును ఆదేశించారు. అలాగే స్థలదాత ఆర్పీ రామకష్ణరాజు గొప్పతనాన్ని అభినందించారు. దాతలు ఉండడం వల్లే నేడు 50పడకల ఆస్పత్రి మంజూరు అయ్యిందని పేర్కొన్నారు. స్థానిక ప్రజలు డిప్యూటీ సీఎం నారాయణస్వామికి రుణపడి ఉండాలని తెలిపారు. ఆస్పత్రికి రించిస్థలంలో నిరుపయోగంగా ఉన్న బావి, గోడలను తొలగించి వాహనాల రాకపోకలకు ఇబ్బంది లేకుండా చూస్తామని పేర్కొన్నారు. అనంతరం మోల్డింగ్ సిద్ధమైన పనులను పరిశీలించారు. కార్వేటినగరంతో పాటు పెనుమూరు మండలంలో కోడా రూ.13 కోట్లతో 50 పడకల ఆస్పత్రిని మంజూరు చేసిన మంత్రికి ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఈఈ లక్ష్మీపతిరెడ్డి, డీఈ సురేష్‌కుమార్, ఎంపీపీ లతబాలాజీ, సర్పంచ్ ధనంజయవర్మ, ఉప సర్పంచ్ శేషాద్రి, క్వాలిటీ కంట్రోల్ అధికారులు, గుత్తేదారు పాల్గొన్నారు.

బిల్డింగ్ నమూనాను పరిశీలిస్తున్న ఎస్ఈ కృష్ణారెడ్డి

మెడికల్ హబ్‌గా తిరుపతి

ప్రజాశక్తి - తిరుపతి సిటీ: మెడికల్ హబ్‌గా తిరుపతి అభివృద్ధి చెందుతుందని టిటిడి ఛైర్మన్ వైవి సుబ్బారెడ్డి అన్నారు. స్విమ్స్‌లో రూ.1.95 కోట్లతో నిర్మించిన రోగుల సహాయకుల వసతి భవనం, బాలమందిర్‌లో అదనపు హాస్టల్ బ్లాక్‌లను టిటిడి ఛైర్మన్, ఈవో ఎవి ధర్మారెడ్డిలు ప్రారంభించారు. ఈ సందర్భంగా వైవి సుబ్బారెడ్డి మీడియాతో మాట్లాడారు. టిటిడి ఆధ్వర్యంలో స్విమ్స్, బర్డ్, పద్మావతి చిన్నపిల్లల హృదయాలయం పేదలకు విశేష వైద్యసేవలు అందిస్తుందని చెప్పారు. టాటా క్యాన్సర్ ఆస్పత్రి, అరవింద కంటి ఆస్పత్రిని తిరుపతికి తీసుకురావడానికి టిటిడి తనవంతు సహకారం అందించిందన్నారు. రాబోయే రోజుల్లో స్విమ్స్‌లో శ్రీ బాలాజి ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఆంకాలజీ, శ్రీ పద్మావతి చిన్నపిల్లల సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రుల నిర్మాణం వేగంగా జరుగుతున్నాయని ఆయన తెలిపారు. తిరుపతి నగరం నడిబొడ్డున పేదలకు అనేక వ్యాధులకు సంబంధించి కార్పొరేట్ ఆసుపత్రుల కంటే మిన్నగా ఉచితంగా వైద్యసేవలు అందిస్తున్నట్టు ఆయన చెప్పారు.

ఎస్వీ బాల మందిర్ అదనపు హాస్టల్ బ్లాక్ ప్రారంభం

అంతకుముందు రూ.10.75 కోట్లతో నిర్మించిన ఎస్వీ బాల మందిర్ అదనపు హాస్టల్ బ్లాక్ భవనాన్ని ఛైర్మన్ వైవి.సుబ్బారెడ్డి ఈవో శ్రీ ధర్మారెడ్డితో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఛైర్మన్ మీడియతో మాట్లాడుతూ తల్లిదండ్రులు లేని పిల్లలను చేరదీసి వారిని బాగా చదివించి ప్రయోజకులను చేయడానికి 1943లో ఎస్వీ అనాథ శరణాలయాన్ని టీటీడీ ప్రారంభించిందన్నారు. 1961లో అప్పటి ప్రధానిజవహర్‌లాల్ నెహ్రూ, ముఖ్యమంత్రి నీలం సంజీవరెడ్డి ఎస్వీ అనాథ శరణాలయాన్ని సందర్శించి ఎస్వీ బాలమందిర్‌గా పేరు మార్చారని చెప్పారు. అనంతరం బాలమందిర్ నిర్వహణ కోసం టీటీడీ ప్రత్యేకంగా ట్రస్టు ప్రారంభించిందన్నారు. వివిధ ప్రాంతాల నుండి వచ్చి ఇక్కడ చదువుకున్న పిల్లలు నేడు మంచి స్థానాల్లో ఉన్నారని, 1వ తరగతి నుండి డిగ్రీ వరకు 500 మంది విద్యార్థులు ఇక్కడ వసతి పొందుతూ చదువుకుంటున్నారని చెప్పారు. వీరికి చదువు తో పాటు చక్కటి వసతి, భోజన సదుపాయాలు టీటీడీ కల్పిస్తోందని, బాలమందిర్‌లో చదువుకుని పిజి, ఇంజినీరింగ్, ఎంబిఏ, ఎంసిఏ లాంటి కోర్సులు చదువుతున్న విద్యార్థులకు ఫీజులు చెల్లించడం జరుగుతోందని వివరించారు. 5 ఫ్లోర్లతో ఈ కొత్తహాస్టల్ బ్లాక్ నిర్మించామని, విద్యార్థులు చదువుకోవడానికి, భోజనం చేయడానికి ప్రత్యేకంగా హాళ్లు ఉన్నాయని చెప్పారు. జెఈవో సదా భార్గవి, చీఫ్ ఇంజినీర్ నాగేశ్వరరావు, ఎస్ఇ ఎలక్ట్రికల్ వెంకటేశ్వర్లు, స్విమ్స్ మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ రామ్, డిఈవో భాస్కర్‌రెడ్డి, శ్వేత డైరెక్టర్ ప్రశాంతి, విజివో మనోహర్, బాలమందిర్ ఎఈవో అమ్ములు పాల్గొన్నారు.

ఎస్వీయూ బంద్‌లో భాగంగా విద్యార్థిసంఘాల నిరసనలు

వర్సిటీలో మూడు రోడ్ల ప్రతిపాదన గొడ్డలిపెట్టు

యూనివర్సిటీ బంద్ విజయవంతం

ప్రజాశక్తి - క్యాంపస్: మాస్టర్‌ప్లాన్ రోడ్ల ప్రతిపాదనలో భాగంగా శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయం నందు మూడు రోడ్ల ప్రతిపాదనలతో విశ్వవిద్యాలయ భవిష్యత్తుకు గొడ్డలిపెట్టు వంటిదని ఎస్వీయూ విద్యార్థి సంఘ ఐక్యవేదిక నాయకులు వ్యాఖ్యానించారు. గురువారం చేపట్టిన బంద్ విశ్వవిద్యాలయంలో విజయవంతంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్వీయూ విద్యార్థి సంఘాల ఐక్యవేదిక నాయకులు మాధవ, ఆర్.కె.నాయుడు, ఆనందగౌడ్, చిన్న, పొత్తూరి శ్రీకాంత్, అక్కులప్పనాయక్, కొట్టే హేమంత్, మల్లికార్జున, శివశంకర్ నాయక్, మహేంద్ర నాయక్ తదితరులు మాట్లాడుతూ విశ్వవిద్యాలయం ప్రారంభం నాడు 1200 ఎకరాలు విస్తీర్ణం కలిగిన ఈ విద్యాసంస్థ నేడు కేవలం 562 ఎకరాలకు పరిమితమైనదని అయితే వాటిని విద్యా, వైద్య సదుపాయాల కోసం వినియోగించడాన్ని విద్యార్థి లోకం స్వాగతించిందని అయితే ప్రస్తుతం మాస్టర్ ప్లాన్ రోడ్ల ప్రతిపాదన లతో విశ్వవిద్యాలయ భవిష్యత్తే ప్రశ్నార్థకంగా మారుతోందని ఆవేదన వ్యక్తంచేశారు. విద్యార్థుల ఆవేదనను, మనోభావాలను అర్థం చేసుకోకుండా నగరపాలక సంస్థ అధికారులు, పాలకమండలిసభ్యులు, తాము అనుకున్నది జరిగి తీరాల్సిందే అన్నట్టుగా వింత వాదన చేస్తూ విద్యార్థి సంఘాలను, ఈ ప్రతిపాదనలను వ్యతిరేకించే రాజకీయ పార్టీలపై దుష్ప్రచారం చేస్తున్నారని పేర్కొన్నారు. విశ్వవిద్యాలయం మధ్యలో రహదారులను వేయడం వలన ఉస్మానియా యూనివర్సిటీ తన అస్తిత్వాన్ని కోల్పోయిందని, ఆంధ్ర విశ్వవిద్యాలయం లో రోజు వారి రోడ్డు ప్రమాదాలను తట్టుకోలేక మూసి వేసారని కళ్లెదురుగా ఇటువంటి ఉదాహరణలు కనిపిస్తున్న యూనివర్సిటీ అధికారులు స్పందించకపోవడం పై విద్యార్థులు ఆగ్రహం వ్యక్తం చేస్తూ ఉపకులపతి ఛాంబర్ ను దిగ్బంధించారు. ఉపకులపతి స్పందిస్తూ ... తాను ఇప్పటికే ఈ విషయంపై మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి దష్టికి తీసుకొని వెళ్ళామని మంత్రి సానుకూలంగా స్పందించారని, ఈ మాస్టర్ ప్లాన్ రోడ్ల కు సంబంధించి పాలకమండలితో కూడా సంప్రదించి విశ్వవిద్యాలయానికి నష్టం వాటిల్లకుండా ముందుకు వెళ్తామని ప్రకటించారు. విద్యార్థి సంఘాల నాయకులు రామ్మోహన్, శేషాద్రి, నాగేంద్ర, వెంకటేష్, బాటసారి,అక్బర్, అశోక్, ఉరుకుందు, పథ్వి, మహేష్,నవీన్, బీసన్న , తిరుమలేష్, చంద్రశేఖర్ నాయక్ పాల్గొన్నారు.

ప్రజాసంక్షేమమే లక్ష్యంగా అభివృద్ధి పథకాలు

ప్రజాశక్తి- వికోట: గత తెలుగుదేశం ప్రభుత్వానికి భిన్నంగా ప్రస్తుత ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి ప్రజాసంక్షేమమే లక్ష్యంగా ప్రజలకు అభివద్ధి పథకాలు అందిస్తున్నారని ఎంపీపీ యువరాజ్ తెలిపారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో గురువారం విలేకర్ల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపిపి మాట్లాడుతూ తెలుగుదేశం పార్టీ మండల అధ్యక్షుడు రంగనాథ్ తన స్థాయిని మరచి ఇటీవల ఎమ్మెల్యే వెంకటే గౌడ, జడ్పీ చైర్మన్ శ్రీనివాసులు పైన గడచిన రెండు సంవత్సరాల మండల పరిషత్ పాలన పైన అనుచిత వ్యాఖ్యలు చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. గత టిడిపి ప్రభుత్వంలో సులోచన రంగనాథ్ ఎంపీపీగా ఉన్న 5 ఏళ్లలో ఏమి అభివధి చేసారో.. ప్రస్తుత పాలకవర్గం 2ఏళ్ల పాలనలో ఎంత అభివద్ధి జరిగిందో చర్చకు మేం సిద్ధమన్నారు. మేం రెండేళ్లలో చేసిన అభివద్ధి కంటే ఒక్క రూపాయి ఎక్కువగా మీరు అభివద్ధి చేసి ఉంటే తన ఎంపీపీ పదవికి రాజీనామాకు సిద్ధమని తప్పుడు ప్రకటనలతో ప్రజలను మభ్యపెట్టాలని చూడడం అవివేకమన్నారు. రూ.60 కోట్లతో మండల మొత్తం ఆర్ అండ్ బి ద్వారా రోడ్లు వేశామన్నారు. పంచాయతీరాజ్ ద్వారా రూ 26 కోట్లతో రహదారులు, ఆర్డబ్ల్యుఎస్ ద్వారా రూ. 37 లక్షలతో వివిధ రకాల పనులు చేసామన్నారు. మండల పరిధిలో 27 జగనన్న లేఅవుట్ల ద్వారా 402 మంది లబ్ధిదారులకు పక్కా గహాలు మంజూరు చేసామని టిడిపి ప్రభుత్వంలో ఎన్ని ఇండ్లు పూర్తిచేశారో ప్రజలకు తెలియజేయాలన్నారు. మీ సొంత పంచాయతీలో వచ్చే ఎన్నికల్లో కేవలం ఒక్క ఓటు మెజార్టీని మీ పార్టీకి తీసుకువస్తే చాలు నేను నా పదవికి రాజీనామా చేస్తా, అదే మీరు మెజారిటీ తీసుకురాకుంటే రాజకీయాల నుంచి వైదొలుగుతావా అని సవాల్ విసిరారు. స్థాయి మరచి దిగజారి ప్రవర్తిస్తే తగిన మూల్యం చెల్లించక తప్పదనారు. జిల్లా పరిషత్ సలహా మండలి సభ్యులు గౌస్, వైస్ ఎంపీపీ లక్ష్మణ్‌రెడ్డి, కిషోర్ గౌడ్, సర్పంచులు పాల్గొన్నారు.

ఆధునిక పద్ధతులతో అధిక దిగుబడులు

ప్రజాశక్తి- చౌడేపల్లి: ఆధునిక వ్యవసాయ పద్ధతులతో పంట అధిక దిగుబడులు సాధించవచ్చునని పుంగనూరు వ్యవసాయ సంచాలకులు శివకుమార్ తెలిపారు. గురువారం మండలంలోని పంచాయతీ కేంద్రం పెద్దకొండామరి పరిసరప్రాంతాల్లో వైయస్సార్ పొలంబడి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ వేరుశనగ పంటలో ఆధునిక పద్ధతులు పాటించాలని, తద్వారా పంటల అధిక దిగుబడి సాధించవచ్చు అన్నారు. వేరుశనగలు విత్తనశుద్ధి చేసుకోవడం వల్ల పంటను 40రోజుల వరకు చీడపీడల నుంచి కాపాడుకోవచ్చునని తెలిపారు. అలాగే పొలం చుట్టూ నాలుగు వరుసలు జొన్న, సజ్జ వంటి ఎత్తుగా పెరిగే పంటలను కంచె పంటగా వేసుకోవడం వల్ల రసం పీల్చు పురుగు వైరసుల నుంచే కాకుండా ప్రధాన పంటను కాపాడుకోవచ్చునని తెలియజేశారు. వేరుశనగ యాజమాన్య పద్ధతులపై రైతులకు ఆయన వివరించారు మండల వ్యవసాయ అధికారిని జ్యోతమ్మ, వీఏఏలు నవీన్ హర్షద్, వీహెచ్ఎ గణేష్, ఆదర్శ రైతు నాగభూషణ్ రెడ్డి పాల్గొన్నారు.

ఆర్థిక సహాయం అందజేత

ప్రజాశక్తి- సోమల: సదుం మండలం జోగివారిపల్లి పంచాయతీ నాయునివారిపల్లెకు చెందిన ఒంటరి మహిళ రాజేశ్వరమ్మ కుమార్తెల చదువు కోసం మాతసేవా చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో మన్యం విశ్వనాథ అధ్యక్షతన రూ.10వేలు ఆర్థిక సహాయాన్ని అందజేశారు. బాలికల విద్యాభివృద్ధి కోసం తమ వంతు సాయంగా ఆర్థిక సాయం అందజేసినట్టు సంస్థ సభ్యులు వసంతమ్మ, గోపాల్, మునీశ్వరి, దొరస్వామి తెలిపారు.

చెంగారెడ్డికి జనసేన నివాళి

ప్రజాశక్తి- వెదురుకుప్పం : మండలంలోని తిరుమలయ్యపల్లి గ్రామ పంచాయతీ, చెంచుగుడి గ్రామానికి చెందిన పందిగుంట చెంగారెడ్డి బుధవారం మృతి చెందారు. విషయం తెలుసుకున్న జనసేన పార్టీ నియోజకవర్గ ఇన్‌ఛార్జి పొన్న యుగంధర్ చెంగారెడ్డి మృతదేహానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. అనంతరం వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఆయన వెంటన మండల బూత్ కన్వీనర్ యతీశ్వర్ రెడ్డి, నాయకులు శేఖర్, విజయ్, మధు, మోహన్, రాఘవ పాల్గొన్నారు.

ఓటర్ నమోదు పారదర్శకంగా ఉండాలి

ప్రజాశక్తి- బంగారుపాళ్యం: ఓటర్ల నమోదు పారదర్శకంగా ఉండాలని జాయింట్ కలెక్టర్ శ్రీనివాసులు అన్నారు. గురువారం తహశీల్దార్ కార్యాలయంలో బిఎల్ఓలతో వీడియో కాన్ఫరెన్స్ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా తహశీల్దార్ బెన్‌రాజ్ మాట్లాడుతూ జిల్లా అధికారుల ఆదేశాల మేరకు బిఎల్ఓలు గడప గడపకు వెళ్లి ఓటర్ల పరిశీలించాలన్నారు. ఓటర్ల అనుమానాలు అవకతవకలకు తావు లేకుండా చేపట్టాల్సిన బాధ్యత బిఎల్ వాళ్ళదే అని ఓటర్ల నమాదాలు క్షేత్రస్థాయిలో పరిశీలించాల్సిందని అన్నారు. మండలంలోని బిఎల్వోలు తదితరులు పాల్గొన్నారు.

'సీఈవోపై అనుచిత వ్యాఖ్యలు చేయడం తగదు'

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్: రాత్రి, పగలు కష్టపడి పనిచేస్తున్న జిల్లా పరిషత్ సిఈఓ ప్రభాకర్‌రెడ్డిపై అనుచిత వ్యాఖలు చేయడం తగదని ఎస్సీ, ఎస్టీ ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు వినాయకం గురువారం స్థానిక ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో తెలిపారు. ఎస్సీ ఎస్టీ ఉద్యోగుల సంఘం తరపున తాము పిఎఫ్‌లోన్ల విషయమై సంబంధిత అధికారిని పిలిపించి పిఎఫ్ లోన్లు సకాలంలో మంజూరు చేయిస్తున్నారని తెలిపారు. తమ సంఘం వాళ్లకు ఎలాంటి పెండింగ్స్ లేవని, ఉద్యోగుల పక్షపక్షపాతి అయినటువంటి ప్రభాకర్ రెడ్డి పై ఎవరో ఆకాశరామన్న ఉత్తరాలు రాసి ఆయన ఇమేజ్‌ను డేమేజ్ చేయడం చాలా బాధాకరమని అన్నారు. సమావేశంలో ఎస్సీ, ఎస్టీ ఉద్యోగుల సంఘం జిల్లా ప్రధానకార్యదర్శి పొద్దుటూరు మురళి, అదనపు కార్యదర్శి ప్రభు కుమార్, ఉపాధ్యక్షులు మహేష్, జిల్లా కార్యదర్శి నాగరాజు, రాష్ట్ర నాయకులు పరంజ్యోతి, కుమార్, తదితరులు పాల్గొన్నారు.

రాగి పంట సాగుపై అవగాహన

ప్రజాశక్తి- శాంతిపురం: సోగడబల్ల గ్రామంలో గురువారం రైతులకు రాగి పంటపై అవగాహణ, శిక్షణాకార్యక్రమం నిర్వహించారు. ఈకార్యక్రమంలో వ్యవసాయ సహాయ సంచాలకులు నాగపద్మిని మాట్లాడుతూ అంతర్జాతీయ చిరుధాన్యాల సంవత్సరంగా 2023ను భారత దేశప్రభుత్వం గుర్తించిందన్నారు. ఇందులో భాగంగా ప్రతి రైతు భరోసా కేంద్రం పరిధిలో రైతులతో రాగి పంట సాగు విస్తీర్ణాన్ని పెంచే విధంగా ప్రభుత్వం చర్యలు చేపడుతుందని తెలియజేశారు. రాగి సాగుపై రైతులకు శిక్షణ కార్యక్రమంలో కావలసిన విత్తనాలను ప్రభుత్వమే సరఫరా చేస్తుందని తెలియజేశారు. రైతు భరోసా కేంద్రం పరిధిలో ఉన్న ప్రతి రైతు గ్రామ వ్యవసాయ సహాయకులు గ్రామ ఉద్యాన సహాయకులు విషయాన్ని తెలియజేసి రైతులకు రాగి పంట సాగు చేసుకుని విధంగా చర్యలు చేపట్టాలని తెలియజేశారు.

విద్యార్థులకు బహుమతులు అందజేత

ప్రజాశక్తి- బంగారుపాళ్యం: క్రీడల్లో గెలుపొందిన విద్యార్థులను భవిత పాఠశాల ఉపాధ్యాయురాలు హిమబిందు బహుమతులు అందజేసి అభినందించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ భవితలో పాఠశాలలో చదివే తనుషా, సుదీప్వి, పృథ్వీ, హేమసాయి, హరికష్ణ, సాయికష్ణ, యువతేజ, నవ్యశ్రీ చిత్తూరులో జరిగిన జిల్లాస్థాయి పోటీల్లో పాల్గొని ప్రతిభ చూపి గెలుపొందారని, వీరికి జిల్లా అధికారులు ప్రశంసాపత్రాలు బహుమతులు అందజేశారని తెలిపారు. కార్యక్రమంలో విద్యార్థుల తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

భోజనం రుచిగా వండిపెట్టాలి

ప్రజాశక్తి- సోమల: మండలంలోని ప్రభుత్వ పాఠశాలల్లో మధ్యాహ్న భోజనం తయారు చేస్తున్న వంటలమ్మలు విద్యార్థులకు రుచికరమైన పరిశుభ్రతతో కూడిన మధ్యాహ్న భోజనాన్ని వండి చిన్నారులకు అందజేయాలని మండల విద్యాశాఖ అధికారిని 2 శివరత్నమ్మ కోరారు. గురువారం అన్నెమ్మగారిపల్లి ప్రాథమికోన్నత పాఠశాలలో విద్యార్థుల తల్లిదండ్రుల సమావేశాన్ని నిర్వహించారు. ఎంఈవో-2 మాట్లాడుతూ విద్యార్థుల చదువుపట్ల తల్లిదండ్రులు కూడా ఆసక్తి చూపాలని కోరారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు, సిబ్బంది, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

పౌష్టికాహారం పంపిణీ

ప్రజాశక్తి- బంగారుపాళ్యం: మహిళలను రక్తహీనత నుంచి కాపాడేందుకే పౌష్టికాహారం అందిస్తున్నట్టు సర్పంచులు దీప్తిరెడ్డి, వాణి ప్రియ తెలిపారు. గురువారం మండలంలోని తగ్గువారిపల్లి పంచాయతీ బంగారుపాలెం 1 అంగన్వాడీ కేంద్రాల్లో పౌష్టిక ఆహారం పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. వారు మాట్లాడుతూ మహిళల్లో రక్తహీనత తగ్గించి, మాతాశిశు మరణాలను తగ్గించాలని ఉద్దేశంతో ఉచితంగా పౌష్టికాహారం అందిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎంపిటిసి షబానా భాను, మాజీ సర్పంచ్ కష్ణమూర్తి, ఉపసర్పంచ్ కామరాజు సురేంద్ర, అంగన్వాడీలు రత్నకుమారి, భారతి, హేమశ్రీ పాల్గొన్నారు.

గంజాయి మత్తులో డ్రైవర్ పై దాడి

ప్రజాశక్తి- పుంగనూరు: గంజాయి మత్తులో ఐదుగురు యువకులు బొలెరో డ్రైవర్‌పై దాడి చేసి గాయపరిచి అతని దగ్గర ఉన్న నగదు దోచుకెళ్లిన ఘటన నక్కబండ కాలనీ వద్ద బుధవారం రాత్రి చోటు చేసుకున్నది. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. మండలంలోని కొండ సముద్రం గ్రామానికి చెందిన లోకరాజు సొంతంగా బొలోరో వాహనం పెట్టుకుని జీవనం సాగిస్తున్నాడు. వాహనంలో ప్రతిరోజు పలమనేరు టమాటా మార్కెట్‌కు టమోటాలు తీసుకెళ్తు ఉంటాడు. బుధవారం టమోటాలు పలమనేరు మార్కెట్లో దింపివేసి తిరిగి వచ్చే సమయంలో మండి నుండి రైతు బిల్లు డబ్బులను రూ.4.50లక్షలు తీసుకొచ్చాడు. ఈ డబ్బులను సింగిరిగుంట గ్రామంలో ఓ రైతుకు ఇవ్వడానికి నక్కబండ మీదగా ఆ గ్రామానికి వెళుతుండగా గంజాయి మత్తులో ఉన్న ఐదుగురు యువకులు అతనిపై దాడి చేశారు. బీరు బాటులతో లోకరాజును తీవ్ర రక్తగాయాలు చేసి అతని వద్ద ఉన్న నగదును దోచుకెళ్లారు. నగదు దోచుకెళ్ళిన వారిలో నక్కబండకు చెందిన నూర్‌షాగా పోలీసులకు లోకరాజు చెప్పారు. అతని అదుపులోకి తీసుకుని విచారిస్తున్నట్లు ఎస్సై మోహన్ కుమార్ తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఆలయాల అభివృద్ధి జగనన్నతోనే సాధ్యం

డిప్యూటీ సీఎం నారాయణస్వామి

ప్రజాశక్తి- కార్వేటినగరం: ఆలయాల అభివద్ధి రాష్ట్రముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్రెడ్డితోనే సాధ్యమని ఉపముఖ్యమంత్రి కళత్తూరు నారాయణస్వామి అన్నారు. గురువారం పెనుమూరు మండలం కలికిరి కొండపై కార్వేటినగరం సుబ్రమణ్యస్వామి ఆలయంలో నిర్వహించే ఆడికత్తిక వార్షిక బ్రహ్మోత్సవాలకు సంబందించిన గోడపత్రికలను ఆలయ అధ్యక్షుడు కే.కేశవరెడ్డి ఆధ్వర్యంలో ఆవిష్కరించారు. ఈసందర్భంగా డిప్యూటీ సీఎం మాట్లాడుతూ మాజీ మంత్రి యల్లంపల్లి శ్రీనివాసులు చొరవతో పురాతన ఆలయాలకు మహర్దశ వచ్చిందన్నారు. ఎన్నడూ లేనివిధంగా నియోజకవర్గంతో అనేక ఆలయాలను అభివద్ధి చేయడం జరిగిందన్నారు. నేటి వరకు రాజగోపురం, ప్రహరీ గోడనిర్మాణానికి రూ.50లక్షలు, అదే విధంగా ఆలయంలోపల ఫ్లోరింగ్ నిర్మాణానికి రూ.35లక్షలు మ్యాచింగ్ గ్రాంట్ కాకుండా ప్రభుత్వ నిధులతో ఆలయాన్ని అభివద్ధి చేయడం జరిగిందన్నారు. అలాగే ఆలయ అధ్యక్షులు కేశవరెడ్డి చొరవతో దాతల సహకారంతో సుమారు రూ.40లక్షలతో ఆలయంలో పలు అభివద్ధి పనులు చేపట్టారని తెలిపారు. ఈనెల 8వ తేదీ భరణీ కత్తిక 9,10,11,12 వరకు ఆడికత్తిక వేడుకలు అంగరంగ వైభవంగా నిర్వహించడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో మండల కన్వీనర్ శేఖర్‌రాజు, మండల కన్వీనర్ కోఆప్షన్ మెంబర్ పట్నం ప్రభాకర్ రెడ్డి, ఆలయ కమిటీసభ్యుడు పయణిరెడ్డి, మాజీ ఏఎంసీ చైర్మన్ కష్ణయాడవు, నాయకులు ఈవీ చందు, సర్పంచ్ శేఖర్రెడ్డి, పలువురు పాల్గొన్నారు.

'సైకిల్ యాత్రను విజయవంతం చేయండి'

ప్రజాశక్తి- శాంతిపురం: నారా చంద్రబాబు నాయుడు ఆదేశాలు మేరకు కుప్పం నియోజకవర్గం మండలాల వారీగా తెలుగుదేశం పార్టీ సైకిల్ యాత్ర నిర్వహించాలని ఆదేశించడమైనది అందులో భాగంగా మొదట రేపు 4వ తేదీ శుక్రవారం ఉదయం 10గంటలకు రామకుప్పం మండలంలోని శ్రీ సుబ్రమణ్యస్వామి దేవాలయంలో ప్రత్యేకపూజలు నిర్వహించి అక్కడ నుండి సైకిల్ యాత్రను ప్రారంభిస్తునట్లు మాజీ ఎమ్మెల్సీ గౌనివారి శ్రీనివాసులు తెలిపారు. మండలంలోని 23 గ్రామ పంచాయతీల నుంచి క్లస్టర్, యూనిట్ ఇన్‌ఛార్జులు, యువత, ఐటిడిపి మహిళా, మండల అనుబంధ సంఘ అధ్యక్షులు, మాజీ ప్రస్తుత సర్పంచ్ ఎంపిటిసిలు పార్టీ కార్యకర్తలు సీనియర్ నాయకులు మండల తెలుగుదేశం పార్టీ కుటుంబ సభ్యులందరూ శాంతిపురం పార్టీ ఆఫీసుకు ఉదయం 9గంటలకు చేరుకోవాలన్నారు. అక్కడి నుండి అ రామకుప్పంలో ప్రారంభం కానున్న సైకిల్‌యాత్రలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ప్రధాన కార్యదర్శి పివి.నాగరాజు, విజయ రామిరెడ్డి, ఉదయ్ కుమార్, ఏఎంసి నాగరాజ్, ఆర్ఎస్ మణి,చంద్రశేఖర్, రమేష్, గోపాల్, నామాలప్ప, రాజేంద్ర, సుబ్బు, జయపాల్, అనసూయ, సుగుణమ్మ పాల్గొన్నారు.

దిశ, క్రైమ్ పోలీసు సిబ్బందికి డ్రిల్ నిర్వహణ

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్: చిత్తూరు జిల్లా ఎస్పీ రిశాంత్ రెడ్డి ఆదేశానుసారం చిత్తూరు సబ్-డివిజన్‌లోని ట్రాఫిక్, డిసిఆర్‌బి, డిటిసి, దిశ, క్రైమ్ పోలీసు అధికారులు, సిబ్బందికి గురువారం చిత్తూరు ఆర్మ్డ్ రిజర్వు ఆఫీస్ పెరేడ్ గ్రౌండ్స్‌లో ఏఆర్ అడిషనల్ ఎస్పీ నాగేశ్వరరావు మోక్‌డ్రిల్ నిర్వహించారు. ఏఆర్ అడిషనల్ ఎస్పీ మాట్లాడుతూ పోలీసులు శాంతి భద్రతల పరిరక్షణలో తమ విధులు నిర్వహిస్తున్నారని, దానితో పాటుగా బందోబస్తులు, పబ్లిక్ మీటింగ్స్ కూడా ముఖ్యమని అందులో కూడా విధి నిర్వహణ చాలా శ్రద్ధగా నిర్వర్తించాలనికనుక ఈరోజు దానిపై అందరికి మోక్ డ్రిల్ నిర్వహిస్తున్నామని తెలిపారు. చిత్తూరు సబ్-డివిజన్ పోలీసులకు మోక్ డ్రిల్ ముగిసిందని, త్వరలో ఇతర సబ్-డివిజన్ పోలీసులకు కూడా నిర్వహిస్తామని తెలియజేశారు. పోలీసు అధికారులు పబ్లిక్ మీటింగ్స్, బందోబుస్తుకు వెళ్ళే తమ సిబ్బందికి తప్పనిసరిగా బ్రీఫింగ్ చేసి పంపాలని, వారి పనితీరును గమనించి ఉద్యోగం అనంతరం వారికి డి-బ్రీఫింగ్ నిర్వహించి వారు ఏవైనా తప్పులు చేసారా అనే దానిపై వారికి వివరించి మరల ఆ తప్పు పునరావత్తం అవ్వకుండా చూడాలని తెలియజేశారు. కార్యక్రమంలో చిత్తూరు డిఎస్పీ శ్రీనివాస మూర్తి, డిటిసి డి.ఎస్పీ శ్రావణ్ కుమార్, ఏఆర్. డి.ఎస్పీ మురళీధర్, ఇన్స్పెక్టర్లు రవిశంకర్ రెడ్డి, భాస్కర్, శ్రీనివాసులు, సుబ్రహ్మణ్యం, ఆర్ఐలు నీలకంటేశ్వర రెడ్డి, మధు, పట్టణ ఎస్ఐలు, ఆర్ఎస్ఐలు సిబ్బంది పాల్గొన్నారు.

మధుసూదన్‌రెడ్డికి బ్రహ్మరథం

ప్రజాశక్తి-ఏర్పేడు : మండలంలోని పంగూరు పంచాయతీలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో పర్యటించిన ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్ రెడ్డికి గురువారం ప్రజలు బ్రహ్మరథం పట్టారు. జగనన్న సంక్షేమ పథకాలను వివరిస్తూ ప్రజల సమస్యలను తెలుసుకున్నారు. ఏర్పేడు మండల ఇన్‌ఛార్జి కిషోర్ రెడ్డి, పొంగూరు సర్పంచ్ వల్లేటి లక్ష్మీ ప్రసన్న, ఉప సర్పంచ్ విజయనిర్మల, వెంకటకష్ణారెడ్డి, గోవర్ధన్ రెడ్డి, పోలయ్య, సుధాకర్ రెడ్డి,కిరణ్ నాయుడు, నారాయణ నాయుడు, కార్యకర్తలు పాల్గొన్నారు.

రత్నమ్మ సేవలు మరువలేనివి

ప్రజాశక్తి-దొరవారిసత్రం: మండలంలోని ఏకొల్లు గ్రామంలో మాజీ మంత్రి పరసం వెంకటరత్నం అత్త వల్లూరు రత్నమ్మ మృతిచెందారు. గురువారం ఆదరణ కూటమును ఆయన కుమారుడు వల్లూరు మనోహర్ నిర్వహించడంతో ఆయన హాజరయ్యారు. చనిపోయిన రత్నమ్మ ఉద్యోగి బాధ్యతగా ప్రారంభ దశలో ఎన్నో పొదుపు సంఘాలను చిట్టమూరు మండలంలో ఏర్పాటు చేసి ఆనాడే గుర్తింపు పొందారన్నారు. కార్యక్రమంలో ఏ కొల్లు పాస్టర్ రవికుమార్, పిసిసి ఛైర్మన్ జయంతి కుమార్, మాజీ సర్పంచ్ బదిలీ రాఘవయ్య సంపత్ బాబు, అనేపూడి భాస్కర్, వాకాడు దినకర్ బాబు తదితరులు పాల్గొన్నారు.

వైసీపీ దౌర్జన్యాలు పెరిగాయి

ప్రజాశక్తి-బాలాయపల్లి: వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి ప్రజలను భయభ్రాంతులకు గురిచేసోందని మండల టిడిపి అధ్యక్షుడు రాయి మస్తాన్ నాయుడు, పార్టీ సీనీయర్ నాయకుడు కూరపాటి రామచంద్రనాయుడు పేర్కొన్నారు. గురువారం మండలంలోని అలిమిలి గ్రామంలో మహాశక్తి రథయాత్ర ప్రారంభించారు. ఈ సందర్భంగా వైసీపీ ప్రభుత్వ వైఫల్యాలను, అరాచకాలను ప్రజల్లోకి తీసుకెళ్లారు. కార్యక్రమంలో సత్యంనాయుడు, జడపల్లి కోటేశ్వరరావు, బాబు రెడ్డి,పార్లపల్లి శ్రీనివాసులు రెడ్డి,రాఘురామ రెడ్డి,భాస్కర్ నాయుడు, గెరటయ్య నాయుడు, నరసింహారాజు తదితరులు పాల్గొన్నారు.

అమ్మవారి సేవలో మంత్రి ఉషశ్రీ చరణ్

ప్రజాశక్తి తిరుచానూరు: తిరుచానూరు శ్రీ పద్మావతి అమ్మవారిని రాష్ట్ర స్త్రీ, శిశు సంక్షేమ శాఖ మంత్రి ఉషా శ్రీ చరణ్ గురువారం రాత్రి దర్శించుకున్నారు. వారికి ఆలయం వద్ద ఇంచార్జి సూపరింటెండెంట్ ప్రసాద్, ఆగమ సలహాదారు శ్రీనివాస్చార్యులు, స్త్రీ, శిశు సంక్షేమ శాఖ జిల్లా పిడి జయలక్ష్మి, అర్చకులు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు.

పాముకాటుకు పాడి ఆవు మృతి

ప్రజాశక్తి - ఎస్ఆర్ పురం: పాముకాటుకు పాడిఆవు మతి చెందిన సంఘటన మండలంలోని పద్మాపురం దళితవాడలో గురువారం చోటు చేసుకున్నది. రైతు చిన్నయ్య కథనం మేరకు తమ పొలంలో ఆవు మేత మేస్తుండగా పాము కాటుకు గురై మరణించినట్లు రైతు చిన్నయ్య తెలిపారు. పాడి ఆవు మీద ఆధారపడి తమ కుటుంబం జీవనం సాగిస్తున్నామని, సుమారు రూ.70వేలు విలువచేసే ఆవు మతి చెందడంతో కుటుంబ సభ్యులు ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వ స్పందించి తమ కుటుంబాన్ని ఆదుకోవాలని కోరారు.

మైనార్టీ యువకుడిపై వైసీపీ దాడి

ప్రజాశక్తి- పుంగనూరు: పట్టణానికి చెందిన మైనార్టీ యువకునిపై వైసీపీ నాయకులు దాడి చేసి గాయపరచడం తీవ్రంగా ఖండిస్తున్నామని తెలుగుదేశం పార్టీ నాయకులు, సామాజికవేత్త సుహేల్ బాష అన్నారు. ఫేస్‌బుక్‌లో వైసీపీకి వ్యతిరేకంగా పెట్టడంతో వైసిపి నాయకులు దాడి చేశారని గాయపడిన యువకుడు పుంగనూరు ప్రభుత్వ ఆసుపత్రిలో ఉండగా గురువారం సుహేల్ బాష యువకుడ్ని పరామర్శించారు. ఆయన మాట్లాడుతూ వైసీపీ గుండాలు దౌర్జన్యం రోజురోజుకు పెరిగిపోతుందని విమర్శించారు. ఫేస్బుక్లో అతని అభిప్రాయాన్ని ఇతరులకు పంచుకోవడం కూడా నేరంగా భావించి అతని ఇంటికి వెళ్లి వైసిపి గుండాలు దాడి చేసి గాయపరచడం సమంజసంగా లేదన్నారు. అన్నింటినీ పట్టణ ప్రజల గమనిస్తున్నారని వారికి బుద్ధి చెప్పే సమయం ఆసన్నమవుతుందన్నారు.

ఏడుగురు పేకాట రాయుళ్ల అరెస్ట్

ప్రజాశక్తి- సోమల: మండల కేంద్రమైన సోమల పంచాయతీ చిన్న సోమల సమీపంలో పేకాట స్థావరంపై ఎస్సై వెంకట నరసింహులు సిబ్బందితో కలిసి వెళ్లి మెరుపు దాడి చేశారు. పేకాట ఆడుతున్న ఏడుగురిని అరెస్టు చేసి వారి వద్ద నుండి రూ.22,330ల నగదు, నాలుగు ద్విచక్ర వాహనాలు, ఒక ఆటో స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్టు తెలిపారు. సదుం మండలానికి చెందిన గోపి, బాలాజీ, శీను, మిగిలిన నలుగురు సోమల మండలానికి చెందినవారుగా ఆయన తెలిపారు.

బీసీవై పార్టీకి సంపూర్ణ మద్దతు

రామచంద్ర యాదవ్‌కి పూర్తి మద్దతు తెలిపిన అఖిలేష్ యాదవ్

ప్రజాశక్తి- పుంగనూరు: ఆంధ్రప్రదేశ్‌లో నూతనంగా ఆవిర్భవించిన భారత చైతన్య యువజన పార్టీకి తమ సంపూర్ణ మద్దతు ఉంటుందని ఉత్తర ప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి, సమాజ్ వాదీ పార్టీ అధినేత అఖిలేష్ యాదవ్ తెలిపారు. రాష్ట్రంలో పరిస్థితులు ఏ మాత్రం బాలేవని.. మీ వంటి పార్టీ, నాయకత్వం అక్కడ అవసరమని బీసీవై పార్టీ అధినేత రామచంద్ర యాదవ్ నీ ఉద్దేశించి ఆయన పేర్కొన్నారు. గురువారం మధ్యాహ్నం లక్నోలో ఈ ఇద్దరి భేటీ జరిగింది. దేశవ్యాప్త రాజకీయ పరిణామాలు సహా, ఆంధ్ర ప్రదేశ్ రాజకీయ అంశాలపైనా విస్తతంగా చర్చించారు. రాష్ట్రంలో బలహీన వర్గాలకు అండగా బీసీవై పార్టీ నిలుస్తుందని అఖిలేష్ యాదవ్ తన ఆశాభావం వ్యక్తం చేశారు. రామచంద్ర యాదవ్‌కి అండగా అన్నివర్గాలు నిలవాలని పిలుపునిచ్చారు.

విద్యార్థులకు పద్యాల పోటీలు

ప్రజాశక్తి- పలమనేరు : ఆగస్టు 29న నిర్వహించే తెలుగు భాషాదినోత్సవంను పురస్కరించుకొని పాఠశాలస్థాయి విద్యార్థులకు పద్యాల పోటీలు నిర్వహిస్తున్నట్లు తెలుగు సాహిత్య సాంస్కతిక సమితి అధ్యక్షులు పి.తులసినాథం నాయుడు తెలిపారు. వందకు పైగా పద్యాలు చెప్పగలిగిన పిల్లలు ఈనెల 15వ తేదీలోపు 93462 49011 నంబరుకు ఫోన్‌చేసి తమ పేర్లను నమోదు చేసుకోవాలన్నారు. అందరికీ బహుమతులు అందించడంతోబాటు అందరికంటే ఎక్కువ పద్యాలు చెప్ప గలిగిన 5మందికి నగదు బహుమతి కూడా అందిస్తామన్నారు.ం

'ఆడుదాం ఆంధ్ర ' పై సమీక్ష

ప్రజాశక్తి- సోమల: అక్టోబర్ రెండవ తేదీ నుండి ప్రారంభం కానున్న ఆడుదాం ఆంధ్ర క్రీడాకార్యక్రమాలపై ఎంపీడీవో నాగరాజు ఎంపిడిఓ కార్యాలయంలో మండలంలోని ఉన్నత పాఠశాలల వ్యాయామ ఉపాధ్యాయులతో ఎంఈఓ శివరత్నమ్మతో సమీక్ష సమావేశం నిర్వహించారు. మండలంలోని అన్ని పంచాయతీల నుండి ఆడుదాం ఆంధ్ర క్రీడాపోటీలకు 17 సంవత్సరాలు పైబడిన బాలబాలికలను ఎంపిక చేసే విధానం, నిర్వహించనున్న క్రీడాఅంశాలపై సవివరంగా చర్చించారు. మండలం నుంచి క్రీడాకారులను ప్రోత్సహించే విధంగా అధిక సంఖ్యలో నమోదు కార్యక్రమాన్ని చేపట్టాలని కోరారు. ఈ కార్యక్రమంలో కందూరు, సూరయ్యగారిపల్లి, నంజంపేట, పెద్ద ఉప్పరపల్లి వ్యాయామ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ముందు ఎమ్మెల్యే వెంకటే గౌడపై గెలవండి

టిడిపి నాయకులపై వైసీపీ నాయకులు ధ్వజం

ప్రజాశక్తి- పలమనేరు: రానున్న అసెంబ్లీ ఎన్నికల్లో ఎమ్మెల్యే వెంకటే గౌడ్‌పై గెలిచి తర్వాత స్థాయి గురించి మాట్లాడుకుందామని వైసిపి నాయకులు టిడిపి నాయకులపై సవాల్ విసిరారు. గురువారం పట్టణంలోని ఎమ్మెల్యే కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. నిన్నటి దినం బుధవారం టిడిపి నాయకులు విసిరిన సవాళ్లపై ప్రతిస్పందిస్తూ వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ ఛైర్మన్ ప్రహల్లాద, హాస్పిటల్ కమిటీ ఛైర్మన్ చెంగారెడ్డి, వ్యవసాయ మార్కెట్ కమిటీ ఛైర్మన్ హేమంత్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ మాజీమంత్రి అమర్నాథరెడ్డి రాష్ట్రస్థాయి నాయకుడైతే మగాడైతే పుంగునూరులో పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డిపై నిలిచి గెలవాలని సవాల్ విసిరారు. 2024 ఎన్నికల్లో 40 వేలు ఓట్ల మెజార్టీకి ఒక్క ఓటు తగ్గిన శాశ్వతంగా రాజకీయ సన్యాసం తీసుకుంటానని తెలిపారు. నియోజకవర్గంలో 400 రోజులు ప్రతి గడపగడపకు వెళ్లి వారి కష్టసుఖాలను తెలుసుకొనే వారికి ప్రభుత్వం ద్వారా అమలవుతున్న సంక్షేమ పథకాలు చేరవేస్తున్నారని అలాంటి వ్యక్తిపై లేని ఆరోపణ చేస్తే సహించేది లేదని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఏరియా ఆసుపత్రి కమిటీ వైస్ ఛైర్మన్ ముజ్జు, గంగవరం సర్పంచుల సంఘం అధ్యక్షులు గిరిరాజారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.